

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

- 30వ తేదీ వరకూ విశాఖలోనే యువనేత
- పార్టీ నాయకులు, కేడర్‌తో సమావేశం



విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి విశాఖకు రానున్నారు. ఆయన గన్నవరం నుంచి రాత్రి 8.45 గంటలకు విమానంలో బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడే బస చేస్తారు. ఈనెల 29వ తేదీ ఉదయం 9.45 గంటలకు కోర్టు ('సాక్షి' పత్రికపై గతంలో దాఖలు చేసిన పరువునష్టం దావా)కు హాజరవుతారు. అక్కడ నుంచి మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని సాయంత్రం వరకు పార్టీ నాయకులు, కేడర్‌తో భేటీ అవుతారు. సాయంత్రం 6.20 గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ ఏర్పాటుచేసే డిన్నర్‌లో పాల్గొని రాత్రి 9 గంటలకు తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస్సులో బస చేస్తారు. ఈనెల 30వ తేదీన మంత్రి కార్యక్రమాలు అధికారికంగా వెల్లడించలేదు.

పార్టీ కార్యాలయం ముస్తాబు

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ నగర పర్యటనకు వస్తుండడంతో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆయన రెండు రోజుల పాటు పార్టీ కార్యాలయంలో ... మిగతా 8వ పేజీలో

ఆల్ ద బెస్ట్ రవి

పారిస్‌లో జరిగే పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి..

- కె.కోటపాడుకు చెందిన పోరాట యోధుడికి శుభాభినందనలు

కొత్తూరు, ఆగస్టు 27: కె.కోటపాడుకు చెందిన రొంగలి రవి షాట్‌పుట్ క్రీడలో రాటుదేలాడు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 8 వరకు పారిస్‌లో జరిగే పారాలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత షాట్‌పుట్ క్రీడాకారునిగా రికార్డు సృష్టించాడు. పుట్టుకతోనే మరుగుజ్జు అయిన రవి కఠోర శ్రమతో ఉన్నత స్థానానికి ఎదిగాడు. గత పారా ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించి సత్తా చాటాడు. ఇప్పుడు పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలో దిగుతున్నాడు. అతను కచ్చితంగా స్వర్ణం సాధిస్తాడని నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీ ఆకాంక్షించారు. రవి విజయం సాధించాలని కోరుతూ క్రీడాకారులు, జిల్లా వాసులు అతనికి శుభాభినందనలు తెలుపుతున్నారు.



పారాలింపిక్స్ షాట్‌పుట్ పోటీలకు ఎంపికైన రొంగలి రవి

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపునకు చర్యలు

అన్ని శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటుచేసిన కలెక్టర్

- డెబ్రిస్ తొలగించాకే గోదాములకు తరలింపు
- వారం రోజులు గడువు కోరిన యాజమాన్యం



ఎసెన్షియా ఫార్మా కంపెనీ

అనకాపల్లి/విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఆర్థిక మండలిలో ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రసాయన నిల్వలు జాగ్రత్తగా తొలగించేందుకు అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. పరిశ్రమలు, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, డ్రగ్ కంట్రోలర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, బాయిలర్ శాఖల అధికారులతో కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం చర్చించారు. ఎసెన్షియా కాంపౌండ్ లోపది రియాక్టర్లు ఉన్నాయని, వాటిలో ప్రాసెస్ జరుగుతుండగా ప్రమాదం జరిగిందని, వెంటనే వాటిని ఆపేశారని, ఆయా రియాక్టర్లలో రసాయన నిల్వలు ఉండిపోయాయని, జాగ్రత్తగా తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్ మందుల తయారీకి అవసరమైన రసాయన ముడి పదార్థాలు, సాల్వెంట్లు, పౌడర్లను కంపెనీ యాజమాన్యం భారీగా నిల్వ చేసిందని, వాటిని కూడా సంస్థ గోదాములకు సురక్షితంగా తీసుకువెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం అన్ని శాఖలు ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్-ఎస్‌ఓపీ) అనుసరించాలని సూచించారు. ఎవరెవరు ఏమి చేస్తారో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పనులన్నీ చేపట్టాలంటే ముందుగా అక్కడ డెబ్రిస్ తొలగించాలని, మంటలు ఆర్పడానికి వెదజల్లిన నీరు నిల్వ ఉండిపోయిందని, కొన్ని క్యాబిన్లలో రసాయన పొగలు వ్యాపించాయని వాటిని బయటకు పంపడానికి అద్దాలను పగులగొట్టారని అవన్నీ అలాగే ఉన్నాయని, రసాయన పొగకు ఆ ప్రాంతమంతా జిడ్డుగా మారిందని, అవన్నీ క్లియర్ చేస్తే తాము పనులు ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ప్రమాద తీవ్రతకు కంపెనీలో లిఫ్ట్ పాడైపోయిందని, ఇప్పుడు భారీగా ఉన్న నిల్వలు తరలించాలంటే...హైడ్రాలిక్ లిఫ్టులు అవసరమని, అదేవిధంగా నిపుణులు, అనుభవజ్ఞులైన సిబ్బంది అవసరమని అధికారులు చెప్పారు. వీటన్నింటినీ సమకూర్చుకోవడానికి, తరలింపునకు వీలుగా గ్రౌండ్ క్లియర్ చేయడానికి వారం రోజులు సమయం కావాలని యాజమాన్య ప్రతినిధులు కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

ఏమేమి ఉన్నాయంటే...

- మొదటి అంతస్థులో సాల్వెంట్ పంపింగ్ చేసిన రియాక్టర్ సామర్థ్యం వేయి లీటర్లు కాగా, అందులో ఎంటీబీఈ 700 లీటర్లు ఉందని గుర్తించారు. కింద గ్రౌండ్ ఫ్లోర్‌లోని ట్యాంకర్ సామర్థ్యం పది వేల లీటర్లు కాగా అందులో ఏమున్నా ... మిగతా 8వ పేజీలో

ఈ-క్రాప్ నమోదుకు సాంకేతిక చిక్కులు

నిత్యం సర్వర్ డౌన్‌తో ముందుకు సాగని ప్రక్రియ

- వచ్చే నెల 15లోగా నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తింపు
- గడువులోగా పూర్తి చేస్తామంటున్న అధికారులు



రోలుగుంట మండలం రత్నంపేటలో ఈ- క్రాప్ నమోదుకు రైతు ఫొటో తీస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియకు సాంకేతిక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నెల 3వ తేదీ నుంచి ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ నిత్యం సర్వర్లు డౌన్ కారణంగా పలు మండలాల్లో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఈ- క్రాప్ నమోదు ఆధారంగానే రైతులకు పంట నష్టపరిహారం, పంటల బీమా, ఇతరత్రా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పథకాలు వర్తింపజేస్తారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, సామాజిక అటవీ ఉత్పత్తులకు సంబంధించి సుమారు 3.15 లక్షల ఎకరాల వరకు సాధారణ విస్తీర్ణం ఉండగా, ఇప్పటి వరకు కురిసిన వర్షాల వల్ల సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా వివిధ పంటలు సాగవుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 24 మండలాల పరిధిలోని 57,161 మంది రైతులకు చెందిన 83,488 ఎకరాల పంటలు ఈ- క్రాప్ యాప్‌లో నమోదయ్యాయి.

సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు

జిల్లాలో ఈ- క్రాప్ నమోదుకు కొన్ని రకాల సాంకేతిక ఇబ్బందులను రైతులు ఎదుర్కొం టున్నారు. రైతులు ఈ- క్రాప్ నమోదు కోసం రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి వివరాలు అందించి రిజిస్ట్రేషన్‌తో పాటు వారు ఈకేవైసీ ప్రక్రియ కూడా చేసుకోవాల్సి ఉంటుంది. సర్వర్ డౌన్ కావడంతో ఈకేవైసీ చేసుకోవడం ... మిగతా 8వ పేజీలో

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు లబ్ధి



ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాలు, ఇతరత్రా రాయితీలు పొందేందుకు అర్హుల జాబితాలో ఉండేలా చూసుకోవాలి. దీనిపై రైతులకు మండల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని మండలాల్లో సర్వర్ డౌన్, ఇతరత్రా సాంకేతిక ఇబ్బందులున్న మాట వాస్తవమే. అయినా గడువులోగా శత శాతం ఈ- క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించాం. రీసర్వే అయిన గ్రామాలతో పాటు సర్వే కాని గ్రామాల్లో కూడా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ జరుగుతోంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సహకరించి వాస్తవ సాగుదారుని పేర్లను నమోదు చేయించుకోవాలి.

- జి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

స్టాక్ పాయింట్ల వద్ద బుకింగ్ నిలుపుదల

- నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం ద్వారానే అమ్మకాలు



నక్కపల్లిలోని స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు

అనకాపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇసుక అమ్మకాలు బుధవారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో జరగనున్నాయి. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక విక్రయాలను నిలిపి వేసి ఎంపీడీవో కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని మండల అధికారులకు జిల్లా అధికారులు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లిలో రెండు ఇసుక స్టాక్ పాయింట్లను అధికారులు గుర్తించారు. నర్సీపట్నంలో గబ్బాడ ఇసుక స్టాక్ పాయింట్‌లో సుమారు 63 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ఇసుక నిల్వలకు సంబంధించిన సరైన రికార్డులు చూపలేదనే కారణంతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఫిర్యాదు చేయడంతో ఇసుక విక్రయాలు జరపలేదు. ఈ స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలపై విచారణ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి నక్కపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌లో సుమారు 52 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ నెల 21 నుంచి ... మిగతా 8వ పేజీలో

ఉద్రిక్తత నడుమ ఆక్రమణల తొలగింపు

వేకువజామునే పోలీసు బందోబస్తుతో ప్రక్రియ పూర్తి

- పంచాయతీ స్థలంలోని దుకాణం, ఇల్లు కూల్చివేత
- ఆందోళనకు దిగిన ఇంటి యజమాని, సీపీఐ నాయకులు



పంచాయతీ స్థలంలోని ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

చోడవరం, ఆగస్టు 27:

పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో ఆక్రమణల తొలగింపు మంగళవారం ఉద్రిక్తతకు దారి తీసింది. వేకువజామునే అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చి ఆక్రమణలను తొలగించారు. ఇంటి యజమాని, సీపీఐ నాయకులు ఆందోళనకు దిగినా పట్టించుకోకుండా ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

ఆక్రమణల తొలగింపును మూడు రోజుల క్రితమే ప్రారంభించగా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నాగలక్ష్మి అనే మహిళ ఇంటి వద్ద పనులకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఆ ఇంట్లో ఉన్న వాళ్లు ఆ సమయంలో బయటకు రాకపోవడంతో అధికారులు పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున పంచాయతీ అధికారులు, మరోసారి పోలీసులతో కలిసి వచ్చి టైర్ల దుకాణంతో పాటు నాగలక్ష్మి ఇంటిని కూడా తొలగించారు. ఈ విషయం తెలిసి సీపీఐ నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పంచాయతీ ఈవో నారాయణరావుతో వాదనకు దిగారు. తెల్లవారుజామున పంచాయతీ అధికారులు చేపట్టిన ఈ ఆక్రమణల తొలగింపు స్థానికంగా చర్చనీయాంశమైంది. కాగా పంచాయతీ అధికారులు తొలగించిన స్థలంలోనే టెంటు వేసిన నాగలక్ష్మి తన బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. ఇంట్లో ఉన్న తమను బలవంతంగా బయటకు లాక్కొని వచ్చి ఇంటిని కూల్చేయడం అన్యాయమని నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్థలంలోనే ఇంటిని నిర్మించి ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. ఆమెకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ వేకువజామున కూల్చివేతలు దారుణమన్నారు. బడాబాబులు పంచాయతీ స్థలాలను ఆక్రమించినా పట్టించుకోని అధికారులు పేదల ఇళ్లు కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు.



తొలగించిన ఇంటి ప్రదేశంలోనే టెంటు వేసిన బాధితురాలు

ముగ్గురు చిన్నారుల మృతిపై విచారణ

కైలాసపట్నం అనాథాశ్రమంపై విచారణ కమిటీ ఆరా

- సమగ్ర వివరాల సేకరణ



కోటవురట్ల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమైన విచారణ కమిటీ ప్రతినిధులు

కోటవురట్ల, ఆగస్టు 27: మండలంలోని కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై విచారణ కమిటీ ప్రతినిధులు చర్చించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దీనిపై సమీక్ష నిర్వహించారు. పాస్టర్ కిరణ్‌కుమార్ నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో 95 మంది విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. ఆ విద్యార్థులను కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్, గొల్లపేట ఎంపీపీ స్కూల్, కైలాసపట్నం, రాజగోపాలపురం ఎంపీపీ పాఠశాలల్లో చేర్పించే సమయంలో ఎవరు సంతకం పెట్టారు?, తల్లిదండ్రులు ఉండగా గార్డియన్‌గా వారితో ట్రస్టు నిర్వాహకుడు కిరణ్‌కుమార్ సంతకాలు చేయించడం పట్ల ఆరా తీశారు. 13 సంవత్సరాలుగా కైలాసపట్నంలో అనాథాశ్రమాన్ని నడుపుతున్నా విద్యాశాఖ అధికారులు గుర్తించకపోవడం నిర్లక్ష్యమేనని గుర్తించారు. ఈ నెల 18వ తేదీన ఆశ్రమంలో అనారోగ్యానికి గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయిన 92 మంది విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లి ఎక్కడి పాఠశాల్లో చేరారు? అనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడి ... మిగతా 8వ పేజీలో

AVANTHI INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
(AUTONOMOUS)
(NAAC Accredited with A+, Permanently Affiliated to JNTU-GV)
Makavarapalem – 531 113, Anakapalli Dist.
Ph: 08932 222382, 9866664636
www.avanthienggcollege.ac.in
B.TECH (LATERAL ENTRY)
SPOT ADMISSIONS-2024
Few seats into second year B.Tech under lateral entry are available in our college under dropout / non reporting / cancellation categories.
CSE | CSE (AI & ML) | CSE (DS) | ECE | EEE | MECHANICAL
Interested can contact the Principal for spot admissions on **Thursday, 29th August 2024 at 10 AM** with necessary documents and required fee.Seats will be filled as per the Guidelines of the ECET Convener. Students admitted under spot admissions are not eligible for Fee reimbursement scheme of Govt. of AP. For Details visit our website.
PRINCIPAL

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు



నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ సర్టిఫికెట్ చూపిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

నర్సీపట్నం, ఆగస్టు 27: నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. మార్చి 15, 16, 17 తేదీల్లో ఎన్‌బీఏకి సంబంధించిన ప్రత్యేక బృందం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా అధ్యాపకులు ఉన్నారా?, లేదా? అని పరిశీలించారు. విద్యా సామర్థ్యాలు, ప్రయోగశాలలు, కళాశాల పరిసరాలు, తరగతి గదులు తనిఖీ చేశారు. పాఠ్యాంశాలు అర్థం చేసుకునే సామర్థ్యం విద్యార్థులకు ఉందా?, లేదా? అని పరిశీలించారు. మెకానికల్ ఇంజనీరింగ్, ఈసీఈ ట్రేడ్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఎన్‌బీఏ గుర్తింపు ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎక్కువ నిధులు మంజూరు చేస్తుంది. ఉద్యోగాలకు దరఖాస్తు, జాబ్ మేళాలకు వెళ్లినప్పుడు ఎన్‌బీఏ గుర్తింపు ఉన్న కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. ఎన్‌బీఏ గుర్తింపు రావడంలో కళాశాల అధ్యాపకులు చాలా కృషి చేశారని ప్రిన్సిపాల్ కేవీ రామచంద్రరావు తెలిపారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

» కేసు నమోదు ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందోనని రోజంతా తర్జనభర్జన పడిన పోలీసులు



కింతాడ కృష్ణ మృతదేహం

మల్కాపురం (విశాఖపట్నం), ఆగస్టు 27: విశాఖలోని డాక్‌యార్డు సర్దార్ వల్లాబాయ్ పటేల్ వంతెన సమీపంలో ఉన్న ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణి షిప్పింగ్ కంపెనీలో లారీ క్లీనర్‌గా పని చేస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు ప్రాంతానికి చెందిన కింతాడ కృష (46) అనే వ్యక్తి మృతి చెందారు. సోమవారం సాయంత్రం ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద శ్రావణ్ షిప్పింగ్‌కు చెందిన సరకును లారీలో లోడ్ చేస్తుండగా వెనక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో కృష్ణకు తీవ్ర గాయాలై మృతి చెందారు. అయితే ఈ ప్రమాదం ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద జరగడం వల్ల ఈ ప్రాంతం హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందా, లేక మల్కాపురం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు స్టేషన్ల పరిధిలోకి వస్తుందా అని తేల్చుకునేందుకు పోలీసులకు ఒకరోజు సమయం పట్టింది. ఇలా తర్జనభర్జనలు పడ్డాక చివరకు ఉన్నతాధికారులు ప్రమాద స్థలం మల్కాపురం పరిధిలోకి వస్తుందని తేల్చడంతో ఆ స్టేషన్ పోలీసులు మంగళవారం ఉదయం కేసు నమోదు చేశారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్యామలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

153 కేజీల శ్రీగంధంతో ఐదుగురి అరెస్టు

» పట్టుబడిన శ్రీగంధం విలువ రూ.3.82 లక్షలు



పట్టుబడిన శ్రీగంధం ముక్కలు, కారు, నిందితులతో పోలీసు, రెవెన్యూ, అటవీ సిబ్బంది

కొయ్యూరు, ఆగస్టు 27: పాడేరు అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.3.82 లక్షల విలువ చేసే 153 కేజీల శ్రీగంధం ముక్కలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పాడేరు అటవీ ప్రాంతం నుంచి శ్రీగంధం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం పోలీసు, అటవీ, రెవెన్యూ సిబ్బంది దొడ్డవరం కూడలిలో మాటు వేసి వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో గోద్రాల నుంచి చీడిపాలెం వస్తున్న కారు ఆపి తనిఖీ చేయగా డిక్కీలో ముక్కలుగా చేసిన 153 కేజీల శ్రీగంధం పట్టుబడినట్టు ఆయన తెలిపారు. కారులో ఉన్న వంతాడపల్లికు చెందిన ముగ్గురు, హైదరాబాదుకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా శ్రీగంధం ముక్కలు మోతుపట్టు గ్రామానికి చెందిన చదల అప్పలకొండ అనే వ్యక్తి, పొంతాడపల్లి గ్రామానికి చెందిన వణుకు అశోక్, కొత్తూరి ఆనంద్ హైదరాబాద్‌కు చెందిన టోని, సుధీర్‌లకు విక్రయించినట్టు చెప్పారు. స్వాధీనపరుచుకున్న శ్రీగంధంను తూనిక వేయగా 153 కేజీలు ఉందని, మార్కెట్ విలువ రూ. 3.82 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం : ఒకరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 27: పాయకరావుపేట మండలంలో పెంటకోట గ్రామ శివార్లలో పోలీసులు మంగళవారం దాడులు చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు 200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ జోగారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పెంటకోట గ్రామ శివార్లలోని నది ఒడ్డున మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్కడ సారా తయారు చేస్తున్న కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేప్రయత్నం చేయగా గజపతినగరం గ్రామానికి చెందిన రాయి గోపి అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతని నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు సమీపంలో దాచిన 200 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కి తరలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27: పట్టణానికి ఆనుకుని ఉన్న శారదానదిలో మంగళవారం పొద్దుపోయాక గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకొచ్చిందని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆమె అనకాపల్లి సమీపంలోనే నదిలో బహుశా నది దాటుతుండగా చిక్కుకుని ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెంది ఉండొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి వయసు 60 ఏళ్ల పైబడి ఉండవచ్చునని, ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఎనిమిది మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కశింకోట, ఆగస్టు 27: మద్యం క్వార్టర్ బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం తమకు వచ్చిన సమాచారం మేరకు నర్సింగబిల్లి గ్రామ శివారున వాహనాలు తనిఖీలు చేయగా మునగపాక మండలం గణపర్తి గ్రామానికి చెందిన కర్రి నూకునాయుడు గణేష్ గోవిందరావు 8 క్వార్టర్ మద్యం బాటిళ్లను గోనె సంచిలో వేసుకొని వస్తుండగా పట్టుబడ్డాడన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

29 నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ఎలమంచిలి, ఆగస్టు 29: ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీ నుంచి వారం రోజుల పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరావు తెలిపారు. జనరేట్ యువర్ బిజినెస్, స్టార్ట్ యువర్ బిజినెస్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణలో స్వయం ఉపాధి ప్రాముఖ్యత, పరిశ్రమల నిర్వహణ, రుణ సదుపాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పరిశ్రమల స్థాపనకు కావలసిన అనుమతులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8142565416, 8106327482 నంబర్లను సంప్రతించాలని కోరారు.

కోలుకున్న 'కైలాసపట్నం' చిన్నారులు

మహారాణిపేట, ఆగస్టు 27: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ ఆ శ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతతో కేజీహెచ్‌లో చికిత్స పొందిన చిన్నారులంతా పూర్తిగా కోలుకోవడంతో వారిని డిశ్చార్జ్ చేసినట్టు సూపరింటెండెంట్ శివానంద, పిల్లల విభాగాధిపతి చక్రవర్తి తెలిపారు. ఆశ్రమంలో వారం క్రితం ఫుడ్ పాయిజిన్ కావడంతో 42 మంది పిల్లలను కేజీహెచ్‌లో చేర్పించినట్టు చెప్పారు. వారంతా పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేసినట్టుపేర్కొన్నారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించి వారు కోలుకొనేలా కృషి చేశారన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ప్రాణం తీసిన భూ తగాదా

» ఒకరి హత్య
» పోలీసుల అదుపులో నిందితుడు



జోగినాయుడు మృతదేహం

మాకవరపాలెం, ఆగస్టు 27: భూ తగాదాలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని తాడపాల గ్రామానికి చెందిన గనిశెట్టి జోగినాయుడు, గనిశెట్టి చిన్న, గనిశెట్టి భాస్కరరావు అన్నదమ్ములు. వీరికి గనిశెట్టి దొరబాబుతో గత కొన్ని నెలలుగా భూ తగాదాలు ఉన్నాయి. ఆ ముగ్గురు అన్నదమ్ములు వ్యవసాయం చేస్తుండగా, దొరబాబు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

ఇరువర్గాల మధ్య భూ తగాదాతో పాటు ఇంటి స్థలం వద్ద తరచూ గొడవలు జరుగుతుండేవి. దొరబాబు తన ఇంటి ముందు ఉన్న స్థలంలో రోజూ ఆటోను ఉంచేవాడు. ఆ స్థలంలో అన్నదమ్ములు రెండు రోజులుగా పశువులను కడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి దొరబాబు తన ఆటోను ఎప్పటిలాగే ఆ స్థలంలో నిలిపి ఇంట్లోకి వెళ్లాడు. దీంతో ఆటోను అక్కడ నుంచి తీసేయాలని దొరబాబుతో ఆ ముగ్గురు అన్నదమ్ములు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో దొరబాబు కుమార్తె తలకు గాయమైంది. దీంతో కోపోద్రిక్తుడైన దొరబాబు కత్తితో ఆ ముగ్గురిపై ఎదురు దాడికి దిగాడు.

ఈ ఘటనలో అన్నదమ్ముళ్లలో ఒకరైన గనిశెట్టి జోగినాయుడు(70)ను కత్తితో నరకడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. మృతుని సోదరుడు నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొరబాబును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టీచర్లకు మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తప్పించాలి

» యూటీఎఫ్ నాయకుల వినతి



అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తూరు, ఆగస్టు 27: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతను ఉపాధ్యాయుల నుంచి తప్పించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమాదేవిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. గత ప్రభుత్వంపై చేసిన పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ ఈ ఫొటోలను ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు గ్రామ సచివాలయ అసిస్టెంట్‌లతో చేయించాలని చెప్పారు. అంతేగాకుండా ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని చెప్పిందని, ఎస్ఎంసీ సభ్యులు, సచివాలయాల అసిస్టెంట్‌లు ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పారన్నారు. మరుగుదొడ్ల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే మరుగుదొడ్ల ఫొటోల పనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రమాదేవి స్పందిస్తూ తక్షణమే ఈ విషయాల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.లక్ష్మి, సీనియర్ నాయకులు జి.కె.ఆర్. స్వామి, అలివేలు, ఎం.వి.అప్పారావు, ఎన్.సతీశ్, ఎం.రాజునాయుడు, దేముడు నాయుడు, బాబూరావు, రవి, తేజ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ

మూలపర్ర రైతుల డిమాండ్



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 27: మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు ఇచ్చిన మూలపర్ర గ్రామస్థులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, సర్వే చేసిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అధికారులకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌డీసీ రమామణి, తహసీల్దార్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మూలపర్ర గ్రామంలో పూర్వం నుంచి స్థిర నివాసం ఏర్పరచుకుని, ఇళ్లకు ఇంటి పన్నులు కడుతున్నారని, వారందరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని ఎస్‌డీసీ చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, గింజాల వెంకట రమణ, జనసేన మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, ఎస్.గోవిందరావు, నానాజీ, శ్రీను, బాబ్జీ నూకరాజు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

» యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27: ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి మండలం సంపతిపురం ప్రాజెక్టులో కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సంపతిపురం ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు వెంటనే అందేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా జిల్లాలో వందలాది మంది ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనాలు లేక, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కూడా ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నా ప్రభుత్వం గాని, జిల్లా యంత్రాంగం గాని చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా టెండర్ కండిషన్‌లకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేయక తప్పదని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, యర్రయ్య అర్జున్, మణికంఠ, అప్పారావు, ఆనంద్ పాల్గొన్నారు.

గుట్టుగా శిశువుల విక్రయాలు

» రూ.10 లక్షల వరకూ వసూలు
» సంతానం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగేవారే టార్గెట్
» బిడ్డను ఇస్తామంటూ ఒప్పందం
» ఆ తరువాత ప్రభుత్వ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల గుర్తింపు
» కుటుంబ, ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని డబ్బు ఎర
» ఒక్కొక్కసారి ఆస్పత్రుల నుంచి దొంగిలించి అమ్మకం

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సంతానం కోసం ఆశగా ఎదురుచూసే దంపతులే లక్ష్యంగా శిశు విక్రయాలను సాగించే ముఠాలు చెలరేగిపోతున్నాయి. జిల్లాలో అనేక ముఠాలు ఈ వ్యాపారం సాగిస్తున్నట్టు సమాచారం. నగరానికే పరిమితం కాకుండా ఇటు శ్రీకాకుళం, అటు కృష్ణా జిల్లా వరకూ తమ కార్యకలాపాలను విస్తరించినట్టు తెలిసింది.

శిశువును కొనుగోలు చేయడం దగ్గర నుంచి విక్ర యించేంత వరకూ పది నుంచి 15 మంది పనిచేస్తుంటారు. వీరంతా రెండు, మూడు జట్లుగా ఏర్పడి నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. నవజాత శిశువు కోసం వారాలు, నెలలు అన్వేషణ సాగిస్తుంటారు. వీరంతా ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసేవారు, వారితో సన్నిహితంగా ఉండేవారేనని అంటున్నారు. నగరంతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ తరహా వ్యాపారం గుట్టుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు కూడా ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు, పట్టణాల్లో స్కానింగ్ కేంద్రాల వద్ద గుట్టుగా ఈ తరహా ఒప్పందాలను చేసుకుంటున్నట్టు చెబుతున్నారు.

బిడ్డ కావాలంటే...ఆపరేషన్ స్టార్ట్

అత్యంత నమ్మకమైన వారి ద్వారా వచ్చే కేసులను మాత్రమే ఈ తరహా ముఠాలు డీల్ చేస్తుంటాయి. పిల్లల కోసం ఆస్పత్రుల చుట్టూ నెలలు, సంవత్సరాల తరబడి తిరిగే దంపతులను గుర్తిస్తుంటాయి. పిల్లలు పుట్టే అవకాశం లేదని వైద్యులు నిర్ధారించే దంపతులతో టచ్‌లోకి వెళ్లి..ఎలాంటి ఇబ్బందులు లేకుండా నవజాత శిశువును అందిస్తామని చెబు తారు. దానికి వారు అంగీకరిస్తే..వెంటనే వారి ఆపరేషన్ ప్రారంభమవుతుంది. ఇందుకోసం కనీసం రూ.10 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు భోగట్టా. ఒప్పందం కుదిరిన వెంటనే ముఠా రంగంలోకి దిగుతుంది. గర్భం దాల్చినవారిని గుర్తించి వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులను గమనిస్తారు. వారికి డబ్బు ఆశ చూపిస్తారు. బిడ్డ పుట్టేంత వరకు వారి బాగోగులు చూసుకుంటారు. అందుకు అవసరమైన ఖర్చులు సమకూరుస్తారు. బిడ్డ పుట్టిన తరు వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించి తీసుకువెళుతుంటారు. ముఖ్యంగా ఇతరులతో సంబంధం లేని వారిని మాత్రమే ఇలాంటి వాటికి ఎంపిక చేసుకుంటారు. అదేవిధంగా రకరకాల కారణాలతో బిడ్డను వద్దనుకునే వారిని కూడా ట్రాప్ చేస్తారు. ఇదంతా ప్రణాళిక ప్రకారం సాగించే వ్యవహారం. ఇలాకాకుండా కొన్నిచోట్ల చిన్నారులను ఆస్పత్రులు, లేబర్ రూముల నుంచి దొంగతనం చేసి విక్రయించేవారున్నారు.

అధికారికంగా దత్తత

పిల్లలు లేని దంపతులు అనధికారికంగా ఇలా చిన్నా రులను కొనుగోలు చేయడం నేరమని బాలల సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎవరైనా పిల్లలు కావాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా దత్తత ఇస్తున్నాయని, ఇందుకోసం కారా పేరుతో వెబ్‌సైట్ ఉందని చెబుతున్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమకు కావా లనుకునే బాలిక/బాలుడిని దత్తత తీసుకోవచ్చునంటు న్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులను కొనుగోలు చేస్తే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.


పీఆర్ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల పరిధిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో అధికారులు, సిబ్బందికి మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చీఫ్ ఇంజనీరు సుబ్బారెడ్డి, ఎస్ఈ రవీంద్ర ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీలు చేపట్టారు. ఆరు జిల్లాల పరిధిలో 335మంది ఏఈలు ఉండగా వీరిలో 30 శాతం మందిని బదిలీ చేశారు. ఏజెన్సీలో మొత్తం ఖాళీలు భర్తీచేయాలని పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించడంతో 50 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న అధికారులకు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు పంపారు. ఇంకా 72 మంది డీఈలు, 12 మంది ఈఈ బదిలీలకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 47 మంది డీఈలు, 153 మంది ఏఈలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఈ హరిరామనాయక్ ఆధ్వర్యంలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసినవారు, పరస్పర బదిలీ కోరుకునే వారికి పోస్టింగ్ ఇచ్చారు.

విశాఖలో రేపు ఆర్థిక సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని నోవాటెల్‌లో ఈనెల 29వ తేదీన ఆర్థిక సదస్సు (సర్క్యులర్ ఎకానమీ పాలసీ టూ ఇంప్లిమెంటేషన్) జరగనున్నది. దేశం నలుమూలల నుంచి పలు రంగాల నిపుణులు హాజరుకానున్నందున సదస్సును విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాటుచేసింది. మంగళవారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులతో నోవాటెల్‌లో సమావేశం నిర్వహించారు.

విఘ్నేశ్వరుడికి వెండి ఆభరణం బహూకరణ



విఘ్నేశ్వరుడికి సమర్పించిన వెండి ఆభరణం

నక్కపల్లి, ఆగస్టు 27: నక్కపల్లిలోని వీవర్స్ కాలనీలో వున్న విఘ్నేశ్వర స్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం అరకిలో వెండి ఆభరణాన్ని బహూకరించింది. మంగళవారం గొట్టుముక్కల శిరీష్ సుకుమార వర్మ, సురేఖ దంపతులు నక్కపల్లిలో వున్న ఆలయానికి వచ్చి స్వామివారి విగ్రహానికి అలంకరించాలన్న ఉద్దేశంతో వెండి తొడుగును అందజేశారు. ఆలయ అర్చకులు పీవీ అప్పలాచార్యులకు ఈ ఆభరణాన్ని అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెండి ఆభరణాన్ని బహూకరించిన దంపతులను సత్కరించారు.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

» సీపీఎం నాయకుల డిమాండ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : ఫార్మా కంపెనీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి.కోటేశ్వరరావు మంగళవారం లేఖలో కోరారు. ఈ మేరకు ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో చోటు చేసుకున్న ప్రమాదం రాష్ట్ర చరిత్రలో అతి పెద్దదిగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత సమయాల్లో పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సెజ్‌లో వంద పడకల ఆస్పత్రిని ఈఎస్ఐ ద్వారా నిర్మింపజేసి వారే నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వలస కార్మికుల వివరాలు నమోదు చేసి తహసీల్దార్లు సంక్షిప్తం చేయాలన్నారు. ప్రమాదకరమైన పరిస్థితులున్న పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులను మాత్రమే నియమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వేసే కమిటీలో కార్మిక ప్రతినిధులను కూడా చేర్చాలని కోరారు. ఎసెన్షియా కంపెనీ నిర్మాణ డిజైన్ లోపం వల్ల ప్రమాదం జరిగిందని నిపుణులు చెబుతున్నారని, మిగిలిన కంపెనీల డిజైన్‌లను కూడా పరిశీలించి లోపాలను సరిచేయించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

నకిలీ హారం కేసులో ఈవో గంగారావు సస్పెన్షన్

నర్సీపట్నం, ఆగస్టు 27 : వేంకటేశ్వరస్వామి గ్రూపు దేవాలయాల పూర్వపు కార్యనిర్వహణాధికారి ఎస్.గంగారావుని దేవదాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆభరణాలలో నకిలీ హారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు.

ప్రజోపయోగ పనులే చేపట్టండి

» అనవసర వ్యయం వద్దు
» భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతుల్లో తాత్సారం చేయొద్దు
» పీపీపీ విధానంలో వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు
» జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సమీక్షలో పురపాలక శాఖా మంత్రి నారాయణ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఏ పని చేపట్టినా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అనవసర వ్యయాలు చేయవద్దని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సూచించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్లు సంపత్‌కుమార్, విశ్వనాథన్, ఇతర అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వడంలో తాత్సారం చేయడం తగదని, ఈ విషయంలో ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు. ప్రతి పనికీ నిర్దేశిత సమయం ఉందని, ఆ గడువులోగా పూర్తిచేయాలన్నారు. ప్రజల్ని పదేపదే కార్యాలయాలకు వచ్చేలా చేయడం తగదన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఆస్తుల పరిరక్షణ, రహదారుల విస్తరణ, ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు, అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు, హాకర్ జోన్లు, వెండింగ్ జోన్లపై చర్చించారు. పీపీపీ విధానంలో ఎవరు ఏయే పనులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, ఫ్లైఓవర్లు, బస్సు షెల్టర్లు, ఫ్యూయల్ స్టేషన్లు, ల్యాండ్ మానిటైజేషన్, ముడసర్లోవలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు, నీటి సరఫరా ఆటోమేషన్ పనులు, స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల గురించి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రహదారులపై సెంటర్ మీడియన్‌లో ఉన్న ప్రకటనల బోర్డులు తొలగించాలని ఆదేశించారు. జోన్ల పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. త్వరలో ఈ అంశాలన్నింటిపైనా వీడియో కాన్ఫరెన్స్ పెట్టి వివరంగా చర్చిస్తానన్నారు.

చెరువుల మధ్య నుంచి రహదారులా!?

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టుగా మార్చుకున్నారని ఫిర్యాదులు ఉన్నాయని, చెరువుల మధ్య నుంచి మాస్టర్ ప్లాన్ రహదారులు వేశారని తన దృష్టికి వచ్చిందని, వాటన్నింటిపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే వీఎంఆర్‌డీఏ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేనందున ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించామన్నారు.

ప్రజాప్రతినిధులతో భేటీ

అధికారులతో సమీక్ష ముగిసిన తరువాత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావులతో సమావేశం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, ఫ్లైఓవర్ వంతెనలు, ఓపెన్ కాలువలు, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, అండర్ గ్రౌండ్ కాలువలు, 24/7 నీటి సరఫరా, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. గత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ నిధుల వినియోగంలో విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,790 కోట్లు రాష్ట్రానికి విడుదల కాలేదని మంత్రి చెప్పారు. దాంతో పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. వచ్చే నాలుగు నెలల్లో ఆర్థిక స్థితిని పూర్తిగా మెరుగుపరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు రవీంద్ర, వర్మ, రమణమూర్తి, వినయకుమార్, సురేశ్, శ్రీనివాసరావు, ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, PONNERI SAI JAIKRISHNA (Old Name), S/o. Ponneri Hari Krishna, resident of 15-3-11, Goturivari Street, Sri Potti Sriramulu Nellore. Change my name from PONNERI SAI JAIKRISHNA (Old Name) to PONNERI JAI KRISHNA SAI (New Name) henceforth I am being called as PONNERI JAI KRISHNA SAI (New Name), S/o. Ponneri Hari Krishna for all purposes.
AJV_192048

CHANGE OF NAME
★ I, KALLA SRINIVASA (Old Name), S/o. Kalla Nagaraju, resident of 26-202, Hanumanthuwaka Junction, Visakhapatnam. Change my name from KALLA SRINIVASA (Old Name) to KALLA SRINIVASA RAO (New Name) henceforth I am being called as KALLA SRINIVASA RAO (New Name), S/o. Kalla Nagaraju for all purposes.
AJV_192049

PLOT FOR SALE
» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర.93985 76997.
AJB_61

For Advertisement Contact :
9963231176
9966165093

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k.
Ph: 9160900024, 9640400073 AJH-16370

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ● అనకాపల్లి ● ఎలమంచిలి ● పాయకరావుపేట ● పెందుర్తి

ఏపీటీఎఫ్ నేతలకు ఘన నివాళి



రామకృష్ణయ్య, సింహాద్రప్పడులకు నివాళులు అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

అచ్యుతాపురం, ఆగస్టు 27 : ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రథసారథుడు సింగరాజు రామకృష్ణయ్య, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ రూపశిల్పి గుల్లిపల్లి సింహాద్రప్పడు వర్ధంతిని మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఫాతిమా మొబీన్ శాస్త్రి, వేంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మూర్తి, అప్పలనాయుడు, ప్రభాకర్, అరుణ కుమారి, విజయ్, రామానుజులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

పరవాడ, ఆగస్టు 27 : జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలల్లో భాగంగా మంగళవారం పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాలామిక్ అధికారి ఆర్.వెంకటరావు మాట్లాడుతూ కంటి చూపును పూర్తిగా పోగొట్టుకున్న వారికి నేత్రదానం చేసే వారి కళ్ల నుంచి కార్నియా మార్పిడి ద్వారా తిరిగి కంటి చూపు రప్పించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి మద్దతు ఇవ్వాలని కోరారు. వచ్చే నెల ఎనిమిదవ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకిరామన్, హెచ్‌వీ పీవీ రత్నం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కరువు

▸▸ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దేముడునాయుడు

రాంబిల్లి, ఆగస్టు 27 : రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లోని ఎస్ఈజెడ్‌లో ఏర్పాటైన ఫార్మా కంపెనీల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఈజెడ్‌లో సుమారు 200 కు పైగా ఉన్న ఫార్మా కంపెనీల్లో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతోం దని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల్లో ఉన్న భద్రతా లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు.పరిశ్రమల్లో ప్రమాదాలకు యాజమాన్య వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి, కార్మికులకు భద్రత కల్పించాలని దేముడునాయుడు డిమాండ్ చేశారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఎస్.రాయవరం, ఆగస్టు 27 : గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి కరణం భాస్కరరావు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన షేక్ యాస్మిన్‌కు రూ.ఆరు వేలు, గణితంలో అత్యధిక మార్కులు సాధించిన జోషిణి దుర్గకి రూ.1116ను భాస్కరరావు అందించి అభినందనలు తెలిపారున. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా చెవిటినూకాలమ్మ జాతర

ఎస్.రాయవరం, ఆగస్టు 27 : మండలంలోని కొత్త పోలవరంలో చెవిటినూకాలమ్మ తల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి తదితర నాయకులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారి జాతరలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జాతర నేపథ్యంలో కొత్త పోలవరంలో ఉదయం నుంచి సందడి వాతావరణ నెలకొంది.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

తుమ్మపాల, ఆగస్టు 27 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మామిడి బాబురావు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి ఎంఆర్‌సీ నుంచి తమ పాఠశాలలకు విద్యార్థి కిట్స్‌కు హెచ్ఎంలకు రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎంఆర్‌సీలో జీతాల బిల్లులు, ఇతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సిరసపల్లి శ్రీనివాసరావు, సతీష్, ఎం. రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు చిన్నారుల మృతిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు చేరే సమయంలో రికార్డులో తల్లిదండ్రుల పేరు రాశారా?, లేక గార్డియన్ పేరు రాశారా? అనేది రాత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఎంఈవోలను ఆమె ఆదేశించారు. ఈ నివేదికను కలెక్టర్ విజయకృష్ణన్‌కు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి శిరీషా, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, నర్సీపట్నం ఆర్డీవోకు బదులు స్థానిక తహసీల్దార్ జానకమ్మ, నర్సీపట్నం డీఎస్పీ బదులు సీఐ అప్పన్నబాబు, ఏఎస్ఐ సూర్యనారాయణ, డీసీహెచ్ శ్రీనివాసరావు, స్థానిక ఎంఈవోలు రామారావు, జోషి పాల్గొన్నారు.



సమగ్ర సస్యరక్షణతో మేలు

▸▸ రైతులకు 'ఆత్మ' పీడీ ఆశాదేవి సూచన

▸▸ ముగిసిన రైతు శిక్షణ

రాంబిల్లి, ఆగస్టు 27 : సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా సకాలంలో చీడపీడలను గుర్తించి నివారించడం వల్ల వ్యయం తగ్గించి దిగుబడులు పెంచుకోవచ్చని విశాఖపట్నం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి అన్నారు. గత వారం రోజులుగా బీటీసీ కృషి విజ్ఞాన కేంద్రంలో 'ఆత్మ' సహకారంతో వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన సమగ్ర సస్యరక్షణ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆశాదేవి మాట్లాడుతూ పరిమితికి మించి రసాయన ఎరువులు వాడటం వల్ల అనారోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయని, అందుకే ఆరోగ్యకర పంటల ఉత్పత్తి ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. మిత్ర పురుగులు, ఉపయోగకర సూక్ష్మజీవుల స్థాయిని నేలలో పెంచుటకు సమగ్ర విధానాలు అనుసరించడం తప్పనిసరి అన్నారు. బీటీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్య, భౌతిక, యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతులను సమగ్రంగా అనుసరించడం ద్వారా రసాయన ఎరువులు, మందులు వాడకం తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడు మండలాలకు చెందిన రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



శిక్షణ పొందిన రైతులకు ధ్రువపత్రాలు అందజేసిన 'ఆత్మ' పీడీ సుజాత

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

▸▸ సచివాలయ పోలీసు సిబ్బందితో సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : సచివాలయాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ, అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సచివాలయ పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. కొద్ది రోజుల్లో వినాయక చవితి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. చవితి నవరాత్రి వేడుకలు సందర్భంగా ఎక్కడా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు.ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐలు వి.సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో సూచలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

క్రీడాకారులకు శారీరక సామర్థ్యం అవసరం



నక్కపల్లిలో క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూరిబాబు

నక్కపల్లి, ఆగస్టు 27 : ఇష్టం ఉన్న క్రీడల్లో క్రీడాకారులు రాణించాలంటే ముందుగా చక్కని ఆరోగ్యం వుండాలని, క్రీడాకారులకు శారీరక సామర్థ్యం ఎంతో అవసరమని నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు పేర్కొన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. ముందుగా నక్కపల్లి హాకీ గ్రౌండ్‌లో క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రీడాకారులు ఫిట్‌నెస్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 29న నక్కపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు హాకీ క్లబ్ సెక్రటరీ కొల్నాటి తాతాజీ, కోచ్ జి.రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, రామచంద్రరావు, రజిత్ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక డీపీఎన్ ఉన్నత పాఠశాలలో ఫిట్ ఇండియా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు కన్వీనర్ బొడ్డేడ అప్పారావు, టీచర్లు పాల్గొన్నారు.



కశింకోట : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రిన్సిపాల్ రవిశంకర్‌కు ఘన నివాళి

పాయకరావుపేట, ఆగస్టు 27 : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ నాయక్ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.సుజాత అన్నారు. ఇటీవల రవిశంకర్ నాయక్ గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ నాయక్ చిత్రపటానికి సుజాత తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి, ఎలమంచిలి, కృష్ణాదేవీపేట, లాలం కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కె.శ్రీదేవి, ఎమ్.విజయ్‌కుమార్, కె.శ్రీహరి, ఎం.స్వామినాయుడు, కె.శైలజ తదితరులతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపునకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ప్రమాదం లేదని తేల్చారు.

- ప్రమాదానికి కొద్ది సమయం ముందు ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు అన్నింటిని అక్కడకు చేర్చారు. వాటికి ఎటువంటి నష్టం కలగలేదు. వాటిని కూడా తరలించాలని నిర్ణయించారు.
- ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ముడి పదార్థాల స్టోరేజీ ఏరియా ఉంది. ఆర్డర్‌పై తయారు చేసిన ఇంటర్మీడియట్ మందులన్నీ అక్కడ ఉన్నాయి. వాటిని కూడా గోదాముకు తరలించనున్నారు.
- సుమారు 60 బ్యాచ్‌ల మందుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు, 25 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములతో నిల్వ చేశారు. వాటిని కూడా తరలింపు జాబితాలో చేర్చారు.

పీపీఈ కిట్లతో పనులు

ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి రసాయనాలు తొలగించడం రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం కాబట్టి, దానివల్ల మరో ప్రమాదం జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ పనుల్లో పాల్గొనే వారందరికీ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ఈ పనులకు నిపుణులను అవుట్ సోర్సింగ్ చేసుకోవాలని సూచించారు.

ఈ- క్రాప్ నమోదుకు సాంకేతిక చిక్కులు

... 5వ పేజీ తరువాయి

ఆలస్యం అవుతోంది. ఈకేవైసీ పూర్తయితేనే పీపీసీ పోర్టల్‌లో రైతుల పేర్లు ప్రదర్శిస్తారు. కొన్నిచోట్ల నెట్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రైతులు కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఈ- క్రాప్ నమోదు చేసుకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రైతులు ఈ- క్రాప్ నమోదు విషయంలో జాప్యం చేయడం వల్ల వారు ధాన్యం అమ్ముకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు పోర్టల్‌లో రైతుల పేర్లు కనిపిస్తేనే వారి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ - క్రాప్ నమోదు చేసుకోని రైతులకు అకాల వర్షాలు కురిసినప్పుడు పంట నష్టపరిహారం అందే పరిస్థితి ఉండదు. రైతులు ఆధార్‌తో లింకు అయిన ఫోన్ నంబరును బ్యాంకు ఖాతాలో అనుసంధాన ప్రక్రియ చేయించుకోకపోవడం వల్ల కూడా నష్టపోతున్నారు.

ఈ- క్రాప్ నమోదుతో ఎంతో మేలు

రైతులు రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలకు వెళ్లి ఈ- క్రాప్ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు విత్తిన వెంటనే సమీపంలోని మండల వ్యవసాయాధికారులను సంప్రతించి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ- క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే ఉచిత పంటల బీమా పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సందర్భంలో రైతులకు బీమా పరిహారం అందుతుంది. ఈ- క్రాప్ నమోదు చేసి రూ.లక్ష లోపు రుణాలు పొందిన రైతులు ఏడాదిలోపు రుణం తిరిగి చెల్లిస్తే వారికి 4 శాతం వడ్డీ రాయితీ అందుతుంది. పంట నష్టం జరిగిన సందర్భంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ప్రభుత్వం రైతులకు అందించే అన్ని రకాల ప్రోత్సాహక పథకాలు, రుణాలు, సబ్సిడీలు రైతులకు అందాలన్నా, దీంతో పాటు ప్రతి రైతు తాను పండించిన పంట దిగుబడులు అమ్ముకోవాలన్నా ఈ- క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి.

జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కొణతాల



ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరిస్తున్న నిర్వాహకులు

కొత్తూరు, ఆగస్టు 27 : అనకాపల్లి జాతీయ రహదారి డైట్ కళాశాల సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరం నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మంగళవారం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు చిత్రపటాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, టీడీపీ నేతలు మళ్ల సురేంద్ర, భవ్యశ్రీ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు, పెంకోట సుబ్రహ్మణ్యం, పీలా శ్రీను, శ్రీరామదాసు గోవింద, మళ్ళ శ్రీను, నూకరాజు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యా కమిటీలది కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్‌నాయుడు

సబ్బవరం, ఆగస్టు 27 : మండలంలోని పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మానటరింగ్ కమిటీ చైర్మన్లు, సభ్యులు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో రమేశ్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్ఎంసీ సభ్యులు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎంసీ కమిటీ మొక్కుబడిగా ఉండకూడదనీ, నిరంతరం పాఠశాలలు సందర్శించి లోటుపాట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలనీ, తద్వారా పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, సీఆర్పీలు, పలువురు హెచ్ఎంలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్...

... 5వ పేజీ తరువాయి

నక్కపల్లి స్టాక్ పాయింట్ వద్ద గనుల శాఖ సిబ్బంది ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. అయితే స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక దొడ్డిదారిన రవాణా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల సంఖ్యలో లారీలు స్టాక్ పాయింట్ల వద్ద బారులు తీరుతున్నాయి. గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. లారీ డ్రైవర్లు, ఇసుక వినియోగదారుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద గనుల శాఖ సిబ్బంది ద్వారా అమ్మకాలు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక ముందు ఎంపీడీవో కార్యాలయాల వద్ద గనుల శాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ ద్వారా డిజిటల్ మోడ్‌లో మాత్రమే ఇసుక బుకింగ్‌లకు అనుమతించనున్నారు.

నక్కపల్లిలో ఆన్‌లైన్ విక్రయాలు

జిల్లాలో నక్కపల్లి ఇసుక స్టాక్ పాయింట్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్న 16,208.59 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను బుధవారం నుంచి ఆన్‌లైన్ మోడ్‌లో విక్రయించనున్నారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఇసుక అమ్మకాల కోసం కో-ఆర్డినేటర్‌ను అందుబాటులో ఉంచనున్నారు. టన్ను ఇసుక లోడింగ్ చార్జీలతో సహా రూ.1,225 ధర నిర్ణయించారు. ఇక ముందు ఇసుక కావాల్సిన వారు ఆధార్, మొబైల్ నంబరుతో పాటు, ఇసుక చేరాల్సిన గమ్య స్థలం వివరాలు అందజేయాల్సి ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్ దూరాన్ని బట్టి నిర్ణయించిన ధరను డిజిటల్ మోడ్‌లోనే నగదు చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ఇసుక పొందాలనుకున్న నిర్మాణదారులతో నగదు లావాదేవీలను అనుమతించరు. నిర్ణీత మొత్తం డిజిటల్ మోడ్‌లో చెల్లించి ఇన్వాయిస్ పొందిన వినియోగదారుడి మొబైల్ నంబరు, వాహనాల ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల ఇన్వాయిస్ ప్రకారమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుంది. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్, రవాణాతో ఎటువంటి అక్రమాలకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

నక్కపల్లి, ఆగస్టు 27 : వచ్చే నెల 2 నుంచి బీజేపీ సభ్యత్వాల నమోదు ప్రారంభమవుతుందని, మండలంలో భారీ స్థాయిలోఈ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేయాలని ఆ పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం నక్కపల్లిలో బీజేపీ సభ్యత్వాల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

... 5వ పేజీ తరువాయి

బస చేస్తారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణం, పరిసరాలు శుభ్రం చేశారు. భవనం ముందు, ఎన్టీఆర్ విగ్రహంచుట్టూ రంగులు వేయిస్తున్నారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలగపూడి, నగర అధ్యక్షుడు గండి బాబ్జీలు నిర్ణయం తీసుకున్నారు. ఆవరణలో టెంట్లు వేయనున్నారు.



☛ సంక్షిప్తంగా..

ఓటర్ల సర్వే విస్తృతం చేయాలి : ఆర్డీవో

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : నియోజకవర్గ పరిధిలో ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలనిఆర్డీవో చిన్నికృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో నియోజకవర్గంలోని బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్లను చేర్పించడం, చనిపోయిన వారి పేర్లను తొలగించే పనులు చేపట్టాలన్నారు. ఓటర్లు ఎవరైనా ఒక చోట నుంచి మరో చోటకు వెళ్లిపోతే వారి అడ్రస్‌లు కూడా మార్పు చేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, అనకాపల్లి డీటీ వై. శ్రీరామ్మూర్తి, కశింకోట మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి పండగ రేపు

పరవాడ, ఆగస్టు 27 : మండల కేంద్రం పరవాడ ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కూడా నిర్వహిస్తున్నట్టుఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పండగ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి ఘటాలు ఊరేగింపు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

29న కోదండరామస్వామి వార్షికోత్సవం

కొత్తూరు, ఆగస్టు 27 : అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ రామభద్రపురం కాలనీలో ఉన్న కోదండ రామస్వామి ఆలయ 25వ వార్షికోత్సవం ఈ నెల 29న జరగనుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవాదుల ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆహార సేవ ప్రారంభం



ఆహార పొట్లాను అందజేస్తున్న వెంకట సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : స్థానిక గవరపాలెం దిబ్బవీధి నాగేంద్రస్వామి సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద మంగళవారం చేపట్టిన ఉచిత ఆహార సేవా కార్యక్రమాన్ని దొడ్డి వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద ఫ్రీజర్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది పేదలకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యల్లపు సత్యనారాయణ, బొడ్డేడ రోషన్‌కుమార్, మద్దాల క్రాంతికుమార్, రాపేటి శ్రీనివాసరావు, పీలా గిరి, కొణతాల శ్రీను పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో 'మలసాల'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : స్థానిక గవరపాలెంలోని దిబ్బవీధిలోని పునః ప్రారంభమైన నాగేంద్రస్వామి సమేతకల్యాణ సుబ్రహ్మణ్యస్వామిని మంగళవారం వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయన వెంట వీధి పెద్దలు దొడ్డి వెంకట సత్యనారాయణ, చైర్మన్ బొడ్డేడ రోషన్‌కుమార్, యల్లపు సత్యనారాయణ, వైసీపీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, మలసాల కుమార్‌రాజా, బొడ్డేడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఆగస్టు 29 : ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మునిసిపాలిటీలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఇ ఆపరేషన్స్ కె.రాజశేఖర్ తెలిపారు. కొత్తపేట, మిలటీరీ కాలనీ, యానాద్రి కాలనీ, స్టేషన్ రోడ్డు, మధురానగర్, నాగేంద్ర కాలనీ, కోర్టుపేట, భవనం వీధి, గాంధీనగర్, ద్వారకానగర్, నెహ్రూనగర్, శేషుగెడ్డ శివాలయం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



నక్కపల్లి, ఆగస్టు 27 : జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నక్కపల్లి మండలం జానకయ్యపేటలో పశువులకు వ్యాధి నివారణా టీకాలు వేశారు. గాలికుంటు, ఇతర వ్యాధులు సోకకుండా పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.కృపావతి ఆధ్వర్యంలో అనేక పశువులకు టీకాలు వేశారు. ఈ వ్యాధులు నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ కృపావతి వివరించారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

శ్రీగౌరీ పరమేశ్వరులకు స్పీకర్ అయ్యన్న ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 27 : ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గవరవీధిలోని శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

ఈ సందర్భంగా స్పీకర్ స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ పాల్గొన్నారు.

పెద్ది అగ్రహారంలో చోరీ

వెండి సామగ్రి, విలువైన వస్తువులు అపహరణ

మాకవరపాలెం, ఆగస్టు 27 : మండలంలోని పోచిన పెద్ది అగ్రహారంలోని ఓ ఇంట్లో చోరులు పడ్డారు. ఈ గ్రామానికి చెందిన కె.నాగమణి దంపతులు రెండు రోజులు కిందట వేరే ప్రాంతానికి వెళ్లారు. వారు తిరిగి సోమవారం మధ్యాహ్నం వచ్చేసరికి ఇంటి గొళ్లెం తెరచి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా కొన్ని వెండి సామగ్రి, కొన్ని విలువైన వస్తువులు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్టు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మాకవరపాలెం, ఆగస్టు 27 : కోల్‌కత్తాలో ఆర్.జి.కార్ మెడికల్ కాలేజీలో చదువుతున్న మౌమిత దెబ్నదా అనే విద్యార్థిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా సెక్రటరీ చింతా శర్మ డిమాండ్ చేశారు. ఈ హత్యను నిరసిస్తూ మంగళవారం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి దురాగతాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వాలు కఠినంగా శిక్షలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవిద్య పాల్గొన్నారు.

భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు

» పార్టీ క్యాడర్‌కు నర్సీపట్నం నియోకవర్గ బీజేపీ కో-కన్వీనర్ వెలగా జగన్నాథం పిలుపు

మాకవరపాలెం, ఆగస్టు 27 : మండలంలో పకడ్బందీగా బీజేపీ సభ్యత్వ నమోదును చేపట్టాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోకవర్గం కో-కన్వీనర్ వెలగా జగన్నాథం అన్నారు. మంగళవారం రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద బీజేపీ సభ్యత్వ నమోదుపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సమావేశాలను నిర్వహించి బీజేపీ విధానాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా వారు పార్టీ పట్ల ఆకర్షితులయ్యేలా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, కార్యకర్తలు బాబూరావు, ఆంజనేయులు, పెంటయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

పలు గ్రామాల్లో గంగాదేవి పండగ

గొలుగొండ, ఆగస్టు 27 : మండలంలో మంగళవారం పలు గ్రామాల్లోఘనంగా గ్రామ దేవత గంగాదేవి పండగ నిర్వహించారు. మండలంలోని జోగంపేట, పాతజోగంపేట, శ్రీరాంపురం, ద్వారకానగరం గ్రామాల్లో గంగాదేవి అమ్మవారిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు. ఆయా గ్రామాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్నసమారాధన చేపట్టారు.

గుంతలమయంగా తాండవ రోడ్డు

నాతవరం, ఆగస్టు 27 : గతుకులమయంగా తయారైన తాండవ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో అంబులెన్స్‌లు రావడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొందని, అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బందిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వయంగా తాండవ రోడ్డు దుస్థితిని చూపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో తాండవ రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం ఆ రహదారి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమ్మవారి బంగారం దొంగ ఎవరో తేల్చండి : టీడీపీ నేత విజయ్

నర్సీపట్నం, ఆగస్టు 27 : శ్రీమరిడి మహాలక్ష్మి వారి బంగారం దొంగ ఎవరో పోలీసులు తేల్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బంగారం దొంగ ఎవరు, ఎక్కడ దాచారు? దొంగతనం చేసే ధైర్యం ఎవరు చేశారు? అన్నది పోలీసులు తక్షణమే తేల్చాలని డిమాండ్ చేశారు. అమ్మవారి బంగారం ఆభరణాలు దేవదాయ శాఖ అధికారులకు అప్పగించేటప్పుడు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జోగారావు, నాగేంద్రరాజు, రాజేశ్, మధు, మురళీకృష్ణ, పైల గోవింద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చింతకాయల విజయ్

బకాయిలు చెల్లించండి

నర్సీపట్నం, ఆగస్టు 27 : ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, భద్రత, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ నీలవేణిదేవికి వినతి పత్రం అందజేశారు. వేతనాలు ప్రతీ నెలా ఏడో తేదీలోగా చెల్లించాలని కోరారు. పనిభారానికి తగిన విధంగా సిబ్బందిని పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఎల్‌వీ రమణ, కార్మికులు పాల్గొన్నాలి.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

... 5వ పేజీ తరువాయి

బస చేస్తారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణం, పరిసరాలు శుభ్రం చేశారు. భవనం ముందు, ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ రంగులు వేయిస్తున్నారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నగర అధ్యక్షుడు గండి బాబ్జీలు నిర్ణయం తీసుకున్నారు.ఆవరణలో టెంట్లు వేయనున్నారు.

నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

నక్కపల్లి స్టాక్ పాయింట్ వద్ద గనుల శాఖ సిబ్బంది ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. అయితే స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక దొడ్డిదారిన రవాణా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల సంఖ్యలో లారీలు స్టాక్ పాయింట్ల వద్ద బారులు తీరుతున్నాయి. గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. లారీడ్రైవర్లు, ఇసుక వినియోగదారుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద గనుల శాఖ సిబ్బంది ద్వారా అమ్మకాలు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక ముందు ఎంపీడీవో కార్యాలయాల వద్ద గనుల శాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ ద్వారా డిజిటల్ మోడ్‌లో మాత్రమే ఇసుక బుకింగ్‌లకు అనుమతించనున్నారు.

నక్కపల్లిలో..

జిల్లాలో నక్కపల్లి ఇసుక స్టాక్ పాయింట్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్న 16,208.59 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను బుధవారం నుంచి ఆన్‌లైన్ మోడ్‌లో విక్రయించనున్నారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఇసుక అమ్మకాల కోసం కో-ఆర్డినేటర్‌ను అందుబాటులో ఉంచనున్నారు. టన్ను ఇసుక లోడింగ్ చార్జీలతో సహా రూ.1,225 ధర నిర్ణయించారు. ఇక ముందు ఇసుక కావాల్సిన వారు ఆధార్, మొబైల్ నంబరుతో పాటు, ఇసుక చేరాల్సిన గమ్య స్థలం వివరాలు అందజేయాల్సి ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్ దూరాన్ని బట్టి నిర్ణయించిన ధరను డిజిటల్ మోడ్‌లోనే నగదు చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ఇసుక పొందాలనుకున్న నిర్మాణదారులతో నగదు లావాదేవీలను అనుమతించరు. నిర్ణీత మొత్తం డిజిటల్ మోడ్‌లో చెల్లించి ఇన్వాయిస్ పొందిన వినియోగదారుడి మొబైల్ నంబరు, వాహనాల ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీని వల్ల ఇన్వాయిస్ ప్రకారమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుంది. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్, రవాణాతో ఎటువంటి అక్రమాలకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఈ- క్రాప్ నమోదుకు సాంకేతిక చిక్కులు

... 5వ పేజీ తరువాయి

ఆలస్యం అవుతోంది. ఈకేవైసీ పూర్తయితేనే పీపీసీ పోర్టల్‌లో రైతుల పేర్లు ప్రదర్శిస్తారు. కొన్నిచోట్ల నెట్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రైతులు కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఈ-క్రాప్ నమోదు చేసుకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రైతులు ఈ - క్రాప్ నమోదు విషయంలో జాప్యం చేయడం వల్ల వారు ధాన్యం అమ్ముకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ధాన్యం కొనుగోలు పోర్టల్‌లో రైతుల పేర్లు కనిపిస్తేనే వారి నుంచి ధాన్యం కనుగోలు చేస్తున్నారు. ఈ- క్రాప్ నమోదు చేసుకోని రైతులకు అకాల వర్షాలు కురిసినప్పుడు పంట నష్టం అందే పరిస్థితి ఉండదు. రైతులు ఆధార్‌తో లింకు అయిన ఫోన్ నంబరును బ్యాంకు ఖాతాలో అనుసంధాన ప్రక్రియ చేయించుకోకపోవడం వల్ల కూడా నష్టపోతున్నారు.

ఈ- క్రాప్ నమోదుతో ఎంతో మేలు

రైతులు రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలకు వెళ్లి ఈ- క్రాప్ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు విత్తిన వెంటనే సమీపంలోని మండల వ్యవసాయాధికారులను సంప్రతించి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ- క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే ఉచిత పంటల బీమా పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సందర్భంలో రైతులకుబీమా పరిహారం అందుతుంది. ఈ- క్రాప్ నమోదు చేసి రూ.లక్ష లోపు రుణాలు పొందిన రైతులు ఏడాదిలోపు రుణం తిరిగి చెల్లిస్తే వారికి 4 శాతం వడ్డీ రాయితీ అందు తుంది. పంట నష్టం జరిగిన సందర్భంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ప్రభుత్వం రైతులకు అందించే అన్ని రకాల ప్రోత్సాహక పథకాలు, రుణాలు, సబ్సిడీలు రైతులకు అందాలన్నా, దీంతో పాటు ప్రతి రైతు తాను పండించిన పంట దిగుబడులు అమ్ముకోవాలన్నా ఈ- క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి.

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపునకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ప్రమాదం లేదని తేల్చారు.

- ప్రమాదానికి కొద్ది సమయం ముందు ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు అన్నింటిని అక్కడకు చేర్చారు. వాటికి ఎటువంటి నష్టం కలగలేదు. వాటిని కూడా తరలించాలని నిర్ణయించారు.
- ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ముడి పదార్థాల స్టోరేజీ ఏరియా ఉంది. ఆర్డర్‌పై తయారు చేసిన ఇంటర్మీడియట్ మందులన్నీ అక్కడ ఉన్నాయి. వాటిని కూడా గోదాముకు తరలించనున్నారు.
- సుమారు 60 బ్యాచ్‌ల మందుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు, 25 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములతో నిల్వ చేశారు. వాటిని కూడా తరలింపు జాబితాలో చేర్చారు.

పీపీఈ కిట్లతో పనులు

ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి రసాయనాలు తొలగించడం రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం కాబట్టి, దానివల్ల మరో ప్రమాదం జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ పనుల్లో పాల్గొనే వారందరికీ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ఈ పనులకు నిపుణులను అవుట్ సోర్సింగ్ చేసుకోవాలని సూచించారు.

ముగ్గురు చిన్నారుల మృతిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు చేరే సమయంలో రికార్డులో తల్లిదండ్రుల పేరు రాశారా?, లేక గార్డియన్ పేరు రాశారా? అనేది రాత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఎంఈవోలను ఆమె ఆదేశించారు. ఈ నివేదికను కలెక్టర్ విజయకృష్ణన్‌కు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి శిరీషా, ఐసీడీఎస్ పీడీ అనంతరలక్ష్మి, నర్సీపట్నం ఆర్డీవోకు బదులు స్థానిక తహసీల్దార్ జానకమ్మ, నర్సీపట్నం డీఎస్పీ బదులు సీఐ అప్పన్నబాబు, ఏఎస్ఐ సూర్యనారాయణ, డీసీహెచ్ శ్రీనివాసరావు, స్థానిక ఎంఈవోలు రామారావు, జోషి పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం


యోగా పోటీల విజేతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

యోగా పోటీల విజేతలకు సత్కారం

చోడవరం, ఆగస్టు 27: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన పతంజలి యోగ కేంద్రం క్రీడాకారులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మంగవారం సత్కరించారు. యోగా శిక్షణ కేంద్రం డైరెక్టర్ పుల్లేటి సతీష్ ఆధ్వర్యంలో ఈ నెల 26న వెన్నెలపాలెంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో గూనూరు పద్మజ, కొట్నాపు హరికిరణ్, గొంతిన లయవర్ధన్, వేపాడ పూర్ణ చంద్రరావు, పుల్లేటి క్రాంతిసాగర్, చింతాడ హర్షవర్ధన్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి యోగాపోటీలకు ఎంపికయ్యారు. వారిని మంగళవారం ఎమ్మెల్యే రాజు అభినందించి, జాతీయ స్థాయిలో సత్తాచాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెదబాబు, పసుమర్తి అశోక్, జెర్రిపోతుల రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

రావికమతం, ఆగస్టు 27: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న కోరారు. మంగళవారం రావికమతంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న బీజేపీ సభ్యత్వ నమోదును ఈసారి మరింత రెట్టింపు ఉత్సాహంతో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు



సకాలంలో వర్షాలు.. చురుగ్గా వ్యవసాయ పనులు

చీడికాడ, ఆగస్టు 27: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవడంతో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతీ ఏడాది ఆగస్టు 10వ తేదీ తరువాత వర్షాలు కురిస్తే వరినాట్లు ప్రారంభించేవారు. ఈ ఏడాది జూలై మొదటి వారంలోనే పొలాల్లో విత్తనాలు జల్లుకున్న రైతులకు, అదే నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకూ తుఫాన్ వర్షాలు కురవడంతో మెట్టు ప్రాంతాల రైతులు ముందుకువచ్చి వరినాట్లు ప్రారంభించారు. అలాగే ఆగస్టు 1వ తేదీన కోనాం జలాశయం నుంచి 200 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశారు. దీంతో కాలువకింద ఆయకట్టు రైతులు వరినాట్లు ప్రారంభించారు. అయితే మర్లగుమ్మి ఆనకట్ట పరిధిలో చీడికాడ డోకలవారి కళ్లాల వద్ద కాలిబాట వంతెన నిర్మాణంలో మట్టి కూరుకుపోయి పది గ్రామాలకు సాగునీరు అందలేదని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పందించారు. ఈ మేరకు 9వ తేదిన ఇరిగేషన్ అధికారులను రప్పించి రైతుల సమక్షంలో కాలువలో పూరుకుపోయిన మట్టిని పరిశీలించారు. 24 గంటల్లో మట్టిని తొలగించి రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించడంతో వెంటనే ఇరిగేషన్ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటుచేసి మట్టిని తొలగించారు. దీంతో ఆ కాలువ ద్వారా పది గ్రామాల రైతులకు సాగునీరు అందడంతో వరినాట్లు పూర్తిచేస్తున్నారు. గత నెల 15వ తేది నుంచి ప్రతీ రోజు వరినాట్లలో రైతులు నిమగ్నయ్యారు. దీంతో ముందుగా వేసిన వరిచేను కళకళలాడుతోంది. కాలువ చివరి ఆయకట్టు, మెట్టు ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు వేస్తున్నారు. కాగా, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2692 హెక్టార్లలో వరినాట్లు వేయాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 95 శాతం వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి ఎం.రమాదేవి తెలిపారు. ఈ నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తిచేస్తామని ఆమె తెలిపారు.


మంచాల గ్రామంలో నాట్ల కోసం పొలాన్ని దమ్ము పడుతున్న రైతులు


తంగుడుపల్లిలో నాట్లు వేస్తున్న మహిళా రైతులు

ప్రమాదకరంగా బీఎన్ రహదారి

» రోడ్డు మధ్యలో గొయ్యితో వాహన చోదకుల అగచాట్లు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 27: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో గొయ్యిలు నుయ్యిలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ఆర్అండ్‌బీ చోడవరం సెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు చోడవరం నుంచి వడ్డాది వరకు గొయ్యలను వెట్‌మిక్స్‌తో కప్పివేసిన విషయం తెలిసిందే. ఇదే రోడ్డులో వడ్డాది నుంచి రావికమతం వరకు బంగారుమెట్ట కూడలి, ఎల్.సింగవరం, బూదిరెడ్డపాలెం, పొట్టిదొరపాలెం గ్రామాల వద్ద పడ్డ గొయ్యిలు నుయ్యిలను తలపిస్తున్నాయి. వర్షాకాల సీజన్ కావడంతో గొయ్యిల్లోకి చేరిన వర్షం చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. సోమవారం ఎల్.సింగవరం వద్ద గొయ్యిలో కలప లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టరు దిగబడిపోవడంతో ట్రాక్టరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కి ఇబ్బంది ఏర్పడింది. మరో ట్రాక్టరు తీసుకొచ్చి త్రాడు సహాయంలో దిగబడిపోయిన లోడ్ ట్రాక్టరు బయటకు తీడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఆర్అంబీ మాడుగుల సెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు వడ్డాది నుంచి రావికమతం రోడ్డులో ఏర్పడ్డ గొయ్యిలను చోడవరం సెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు మాదిరిగా వెట్‌మిక్స్‌తో పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.


ఎల్.సింగవరం వద్ద గొయ్యిలో కూరుకుపోయిన కలప లోడ్ ట్రాక్టర్

ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థికి సత్కారం

రోలుగుంట, ఆగస్టు 27: మండలంలోని బీబీ పట్నం హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కసిరెడ్డి హేమలతకు మంగళవారం పాఠశాలలో ఘన సన్మానం జరిగింది. మాజీ క్రికెటర్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ తాడి రమేష్‌నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి హేమలతకు నగదు బహుమతి అందించి సత్కారం నిర్వహించారు. భవిష్యత్తులో చక్కగా చదువుకుని మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. హెచ్ఎం అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ

చోడవరం, ఆగస్టు 27: పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు మంగళవారం స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులకు వారి విధులు, బాధ్యతలు గురించి అవగాహన కల్పించారు. పాఠశాలలో మెరుగైన మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల సమగ్రంగా నడిచేలా కృషిచేయాలని ఎంఈవో సింహాచలం సూచించారు. కార్యక్రమంలో కోర్సు శిక్షకులు రామిరెడ్డి, ఆర్.చిరంజీవి పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో

పాఠశాలలను అభివృద్ధి చేయండి

దేవరాపల్లి, ఆగస్టు 27: పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో ఉషారాణి కోరారు. కమిటీ ఎన్నికైన సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలకు యాజమాన్య కమిటీ ఆవశ్యకతను వివరించారు.

'వర్గీకరణ విధానాన్ని అడ్డుకుందాం..'

దేవరాపల్లి, ఆగస్టు 27 ఐకత్యంతోనే వర్గీకరణను అడ్డుకుందామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కీలక నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల నేత కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునపరిశీలన చేయాలని కోరారు. వర్గీకరణ పేరుతో ఎస్సీ ఉపకులాల మధ్య చిచ్చు పెట్టే విధానాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్రాలు పునరాలోచన చేయాలన్నారు. లేదంటే దశలవారీ ఉద్యమం చేపడతామన్నారు.

మాడుగుల
నియోజకవర్గం


ఎ.కోడూరు రైతు సేవా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏడీ

18 వరకు పశువులకు టీకాలు

» పశు సంవర్ధక శాఖ ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు, ఆగస్టు 27: పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) ఈ.దినేష్‌కుమార్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి, ఆలమండ, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు గ్రామాల్లో ఎన్ని పశువులకు టీకాలు వేశారని పరిశీలించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ వచ్చే నెల 18వ తేదీలోగా గాలికుంటు నివారణ టీకాలు, బ్రూసెల్లో సిస్ టీకాలు పూర్తిగా వేయిస్తాన్నారు. దేవరాపల్లి, కెకోటపాడు మండలాల్లో 38 వేల పశువులు ఉన్నాయని, ఇప్పటివరకు ఐదు వేల పశువులకు టీకాలు పూర్తి చేశామని ఏడీ వివరించారు.

టీకాలు తప్పనిసరి


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

చీడికాడ, ఆగస్టు 27: పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని ఆ శాఖ ఏడీ వి.చిట్టినాయుడు ఆదేశించారు. మండలంలోని ఎల్‌బి.పట్నం, దండిసురవరం, గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి, బ్రూ సెల్లోసిస్ నివారణకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్పష్టం చేశారు. పాడి రైతులను రైతుసేవా కేంద్రంలో అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుంచి చేపడుతున్న లింగనిర్ధారిత వీర్యం, పశు బీమా పథకం గురించి ఆయన తెలియజేశారు. ఇప్పటివరకూ మండలంలో 4370పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 130 ఆడపెయ్యిలకు బ్రూసిస్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖండివరం పశువైద్యాధికారి గణేష్, సిబ్బంది శ్రీనివాసరావు, శేషు, రైతులు పాల్గొన్నారు.

కాచిచల్లార్చిన నీటినే తాగాలి

చీడికాడ, ఆగస్టు 27: వర్షాకాలం పూర్తయ్యేవరకూ అందరూ కాచిచల్లార్చిన నీటినే తాగాలని కోనాం సబ్ సెంటర్ హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు సూచించారు. వీరభద్రునిపేట శివారు గొప్పూరు గిరిజన గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 18 మంది రోగులను తనిఖీచేయగా ఒకరికి జ్వరం ఉన్నట్టు గుర్తించారు. అందరికీ మందులు పంపిణీచేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.